ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
గురువారం 12 ఫిబ్రవరి 2026 www.prajaswaramdailly.com 2 PM


# జాహ్నవి కుటుంబానికి రూ.262 కోట్ల పరిహారం

**సియాటెల్ ఒప్పందం**

**అమెరికాలో ఇటీవల పోలీసు పెట్రోలింగ్ వాహనం ఢీకొట్టగా మృతి**

వాషింగ్టన్, ప్రజాస్వరం
అమెరికాలో పోలీసు అధికారి నిర్లక్ష్యం వల్ల తెలుగు విద్యార్థిని జాహ్నవి కందుల మృతి చెందిన కేసులో ఆమె కుటుంబానికి 29 మిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో రూ.262 కోట్లు) పరిహారం చెల్లించేందుకు సియాటెల్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈమేరకు సిటీ అటార్నీ ఎరికా ఇవాన్స్ బుధవారం ప్రకటన విడుదల చేశారు. ''జాహ్నవి కందుల మృతి అత్యంత బాధాకరం. ఈ సెటిల్మెంట్‌తో ఆమె కుటుంబానికి కాస్తయినా ఉపశమనం లభిస్తుందని ఆశిస్తున్నాం'' అని సియాటెల్ అటార్నీ తమ ప్రకటనలో పేర్కొన్నారు.

**వివరాలు..**



ఆంధ్ర కర్నూలు జిల్లాకు చెందిన జాహ్నవి (23) ఉన్నత చదువుల కోసం 2021లో అమెరికా వెళ్లారు. సౌత్‌లేక్ యూనియన్‌లోని నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీలో చేరారు. 2023 జనవరి 23న రాత్రి ఆమె రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన పోలీసు పెట్రోలింగ్ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన జాహ్నవి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదానికి కారణమైన పోలీసు అధికారి కెవిన్ డవే.. జాహ్నవి మృతిపై జోకులు వేయడం , 'ఆమె ఓ సాధారణ వ్యక్తి.. ఈ మరణానికి విలువ లేదు' అని పోలీసు అధికారి అన్న మాటలు ఆయన బాడీ కెమెరాలో రికార్డయ్యాయి. కెవిన్ తీరుపై అమెరికాలోనూ విమర్శలు రావడంతో ఆయనను విధుల నుంచి తొలగించారు.

## గాంధీసరోవర్ ప్రాజెక్ట్

# శంకుస్థాపనకు రండి

**రాజ్‌నాథ్‌కు సీఎం రేవంత్ ఆహ్వానం**

**మూసీ పునరుజ్జీవంలో భాగంగా చేపడుతున్నాం**



న్యూఢిల్లీ, ప్రజాస్వరం
న్యూఢిల్లీ లో గురువారం ఉదయం రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఫిబ్రవరి చివరి వారంలో నిర్వహించే గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరుకావాలని కేంద్రమంత్రిని సీఎం ఆహ్వానించారు. ఈసా, మూసీ నదుల సంగమ స్థలంలో దీన్ని చేపడుతున్నట్లు వివరించారు. మూసీ పునరుజ్జీవ కార్యక్రమంలో భాగంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టును చేపడుతున్నామని తెలిపారు. బాపూఘాట్ ను ప్రపంచ స్థాయి విద్య, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, పర్యావరణ చిహ్నంగా నిలపనున్నట్లు రాజ్ నాథ్ కు రేవంత్ వివరించారు.

కేంద్రమంత్రులు రామ్మోహన్‌నాయుడు, అశ్వినీ వైష్ణవ్‌తో సీఎం భేటీ అయ్యారు. వరంగల్‌లోని మామునూరు విమానాశ్రయానికి భూసేకరణ పూర్తయినందున అవసరమైన పనులు చేపట్టాలని రామ్మోహన్‌నాయుడికి విజ్ఞప్తి చేశారు. కొత్తగూడెం ఎయిర్‌పోర్ట్‌కు పాల్వంచలో స్థలం గుర్తించామని.. ఓఎల్ఎస్ సర్వే, ఫీజుబిలిటీ స్టడీ నిర్వహించాలని కోరారు. పెద్దపల్లి జిల్లాలో అంతర్గాం ఎయిర్‌పోర్ట్‌కు ప్రత్యామ్నాయ స్థలం గుర్తించినందున వెంటనే అనుమతులు మంజూరు చేయాలని కేంద్రమంత్రికి సీఎం వినతిపత్రం అందజేశారు. అనంతరం రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను రేవంత్ కలిశారు. రాష్ట్రానికి సంబంధించిన రైల్వే ప్రాజెక్టులపై ఆయనతో చర్చించారు.



# స్పీకర్ ఛాంబర్‌లోకి 20-25 మంది కాంగ్రెస్ ఎంపీలు

**సోషల్ మీడియాలో కేంద్రమంత్రి రిజిజు .. వీడియో పోస్టు**

న్యూఢిల్లీ, ప్రజాస్వరం

20–25 మంది ఆ పార్టీ ఎంపీలు స్పీకర్ ఓం బిర్లా ఛాంబర్ లోకి ప్రవేశించారని , ఆయనను దుర్భాషలాడటంతో పాటు ప్రధాని మోదీ పై కూడా బెదిరింపు వ్యాఖ్యలు చేశారని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. ఫిబ్రవరి 4న జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియోను ఆయన తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేశారు. లోక్ సభలో ప్రధాని మోదీని చుట్టుముట్టేందుకు కాంగ్రెస్ సభ్యులు ప్లాన్ చేసినట్లు ఇటీవల స్పీకర్ ఓంబిర్లా వెల్లడించిన విషయం తెలిసిందే. విపక్షాల నిరసనల దృష్ట్యా ప్రధానిని సభకు రావొద్దని సూచించినట్లు ఆయన పేర్కొన్నారు. దీనికి సంబంధించిన వీడియోను రిజిజు మంగళవారం పంచుకున్నారు. మా పార్టీ చర్చలకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తుంది. ఎంపీలు ఇలా బెదిరింపులకు పాల్పడటాన్ని మేం ఎప్పటికీ ప్రోత్సహించం' అని రిజిజు రాసుకొచ్చారు. తాజా వీడియోలో.. స్పీకర్ ఓం బిర్లా ఛాంబర్ లోపల అనేకమంది ఎంపీలు ఉన్నారు. వారు గట్టిగా మాట్లాడుతుండగా.. కేంద్ర మంత్రితో సహా పలువురు బీజేపీ ఎంపీలు పక్కన నిల్చొన్నట్లు అందులో కన్పిస్తుంది.



# మేడారంహుండీ ఆదాయంరూ.13.25కోట్లు

వరంగల్, ప్రజాస్వరం
మేడారం మహా జాతరలో ఏర్పాటు చేసిన 828 హుండీల లెక్కింపు బుధవారంతో ముగిసింది. ఈ నెల 5 నుంచి హనుమకొండలోని తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో హుండీల లెక్కింపు ప్రారంభించారు. వారం రోజుల పాటు మొత్తం లెక్కించగా రూ.13,25,83,269 ఆదాయం లభించింది. 400 మంది సిబ్బంది దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో లెక్కించారు. విదేశీ కరెన్సీ, రద్దు చేసిన నోట్లు, వెండి బంగారు ఆభరణాలు హుండీల్లో లభించాయి. 2024 జాతరలో రూ.13.25,22,511 ఆదాయం రాగా ఈ సారి అంతే మొత్తం రావడం గమనార్హం. గత జాతరలో 540 హుండీలను ఏర్పాటు చేశారు. ఈసారి 828 హుండీలను ఏర్పాటు చేశారు

# ఎర్రకోట వద్ద పేలుడులో.. జైషే హస్తం

న్యూఢిల్లీ, ప్రజాస్వరం

గతదాది న్యూఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు ఘటన విషయమై పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తోన్న జైషే మహ్మద్ ఉగ్ర ముఠాతో సంబంధం ఉందని ఐక్యరాజ్య సమితి పేర్కొంది. ''ఆంక్షలు ఉన్నప్పటికీ జైషే ముఠా పలు ఉగ్రదాడులకు పాల్పడినట్లు తెలుస్తోంది. అందులో ఒకటి 2025 నవంబరు 10న దిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన దాడి అని ఐరాస సభ్య దేశం ఒకటి ఆరోపించింది. ఇక అంతర్జాతీయ నిఘా నుంచి తప్పించుకునేందుకు జైషే కొత్త పన్నాగాలు పన్నుతోంది. గతేడాది జమాత్ ఉల్ ముమినత్ పేరుతో మహిళా వింగ్ ను ఏర్పాటుచేసుకుంది. ఇది చాలా ఆందోళనకర పరిణామం'' అని నివేదికలో పేర్కొంది. ఈ సందర్భంగా పహల్గాం ఘటనను కూడా ఐరాస తన నివేదికలో ప్రస్తావించింది. ఆ దాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులు హతమైనట్లు ఐక్యరాజ్య సమితీ తెలిపింది. . ఈ దాడి వెనక జైషే మహ్మద్ హస్తం ఉన్నట్లు దర్యాప్తులో గుర్తించారు. ఎర్రకోట వద్ద ఆత్మాహుతి చేసుకున్న డాక్టర్ ఉమర్ నబీకి సంబంధించి ఓ వీడియోను స్వాధీనం చేసుకున్నారు. అందులో భారత్ వ్యాప్తంగా ఆత్మాహుతి దాడులకు ఈ ముఠా కుట్రలు పన్నినట్లు తేలింది.

# తుర్కియే పార్లమెంట్లో బాహాబాహీ

**న్యాయ శాఖ మంత్రిగా గుర్లెక్ నియామకం**

**ప్రమాణానికి సిద్ధం అవుతుండగా అడ్డుకునేందుకు ప్రతిపక్షాల యత్నం**

**అధికార, ప్రతిపక్షాల మధ్య ఘర్షణ**

**నేతలు పరస్పరం తోసుకుంటూ దాడి**

తుర్కియే , ప్రజాస్వరం
పార్లమెంటులో కొత్త న్యాయశాఖ మంత్రి నియామకంపై జరిగిన ఘర్షణల్లో నేతలు పరస్పరం దాడి చేసుకున్నారు. దీనికి సంబంధించిన దృశ్యాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇస్తాంబుల్ చీఫ్ ప్రాసిక్యూటర్ అయిన అకిన్ గుర్లెక్‌ను కొత్త న్యాయశాఖ మంత్రిగా.. తుర్కియే అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్ నియమించారు. గుర్లెక్ బుధవారం ప్రమాణస్వీకారానికి సిద్ధమవగా.. దాన్ని అడ్డుకునేందుకు ప్రతిపక్షాలు పోడియం వద్దకు దూసుకొచ్చాయి. ఈ క్రమంలో అధికార,



ప్రతిపక్షాల మధ్య ఘర్షణ చెలరేగింది. నేతలు పరస్పరం తోసుకుంటూ.. దాడి చేసుకున్నారు. పార్లమెంటులో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో.. స్పీకర్ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. కొంతసేపటి తర్వాత తిరిగి సమావేశం ప్రారంభమవగా.. అధికార పార్టీ నేతలు గుర్లెక్ చుట్టూ రక్షణగా నిలబడి ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. న్యాయమంత్రిత్వ శాఖకు అధిపతిగా గుర్లెక్ నియామకంపై ప్రధాన ప్రతిపక్షం రిపబ్లికన్ పీపుల్స్ పార్టీ (సీహెచ్ పీ) తీవ్ర అభ్యంతరాలు వ్యక్తంచేసింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడేవారిని లక్ష్యంగా చేసుకోవడానికి ఈ నియామకం చేపట్టారని, ఇది న్యాయ స్వేచ్ఛను కూడా దెబ్బతీస్తుందని విమర్శలు చేసింది.

# 21న ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్

**అవార్డుల కోసం పోటీపడుతున్న తమిళ, తెలుగు, మలయాళ, కన్నడ చిత్రాలు**

టాలీవుడ్, ప్రజాస్వరం

ఫిబ్రవరి 21న 70వ ఫిల్మ్ ఫేర్ అవార్డుల వేడుకలు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది అవార్డుల కోసం పోటీపడుతున్న తమిళ, తెలుగు, మలయాళ, కన్నడ చిత్రాల జాబితా విడుదలైంది. 2024లో విడుదలైన సినిమాల్లో ఎంపికైన వాటికి అవార్డులు అందించనున్నారు. ఈ అవార్డు కోసం పోటీపడుతోన్న తెలుగు చిత్రాల జాబితా ఇదే..

**ఉత్తమ చిత్రం..**

35 చిన్నక థ కాదు
కమిటీ కుర్రోళ్లు
హనుమాన్
కల్కి 2898 ఏడీ
లక్కీ భాస్కర్
పుష్ప : ది రూల్

**ఉత్తమ దర్శకుడు**

నాగ్ అశ్విన్ (కల్కి 2898 ఏడీ)
నంద కిశోర్ (35 చిన్నక థ కాదు)
ప్రశాంత్ వర్మ (హనుమాన్ )
సుకుమార్ (పుష్ప : ది రూల్ )
వెంకీ అట్లూరి (లక్కీ భాస్కర్ )
యదు వంశీ (కమిటీ కుర్రోళ్లు)

**ఉత్తమ నటుడు..**

అల్లు అర్జున్ (పుష్ప : ది రూల్ )
దుల్కర్ సల్మాన్ (లక్కీ భాస్కర్ )
ఎన్టీఆర్ (దేవర)
నాని (సరిపోదా శనివారం)
సిద్దూ జొన్నలగడ్డ (టిల్లు స్క్వేర్ )
తేజ సజ్జ (హనుమాన్ )
వైబ్ మ్యాచ్ అయితేనే పెళ్లి.. జెన్ –జీకి లావణ్య త్రిపాఠి సలహా

**ఉత్తమ నటి**

అనుపమ పరమేశ్వరన్ (టిల్లు స్క్వేర్ )
ఆషికా రంగనాథ్ (నా సామిరంగ)
మీనాక్షి చౌదరి (లక్కీ భాస్కర్ )
నివేదా థామస్ (35 చిన్నక థ కాదు)
ప్రియాంక మోహన్ (సరిపోదా శనివారం)
రష్మిక (పుష్ప : ది రూల్ )

ఉత్తమ సహాయ నటుడు
అమితాబ్ బచ్చన్ (కల్కి 2898 ఏడీ)
ధనంజయ్ (జీబ్రా)
ఫహద్ ఫాజిల్ (పుష్ప : ది రూల్ )
సత్య (మత్తు వదలరా 2)
ఎస్ జే సూర్య (సరిపోదా శనివారం)
వినయ్ రాయ్ (హనుమాన్ )

**ఉత్తమ సహాయ నటి**

అంజలి (గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి)
ఫరియా అబ్దుల్లా (మత్తు వదలరా 2)
రషి సింగ్ నందు (ప్రసన్నవదనం)
శరణ్య ప్రదీప్ (అంబాజీపేట మ్యారేజీ బ్యాండు)
శ్రద్ధా శ్రీనాథ్ (మెకానిక్ రాకీ)
వరలక్ష్మి శరత్ కుమార్ (హనుమాన్ )

